సాక్షి హనుమకొండ

శనివారం । 13 । జనవరి । 2024



కేయూ అవగాహన ఒప్పందం

న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగిన కాకతీయ యూనివర్సిటీ.. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

- 10లో▸



భక్తుల బాధలకు చెల్లు

ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామివారి ఆలయానికి సంబంధించి పదేళ్ల తర్వాత తొలి ఫెస్టివల్ కమిటీ ఏర్పడింది. ఇక నుంచి భక్తులకు బాధలు తప్పనున్నాయి.

- 10లో▸

గరిష్టం/కనిష్టం

$33^0/18^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చలిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యారంగ పరిరక్షణకు సంఘాలు కృషి చేయాలి



విద్యారణ్యపురి: విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై అన్నారు. శుక్రవారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర శాఖ రూపొందించిన టీఎస్‌యూటీఎఫ్ డైరీని, క్యాలెండర్‌ను డీఈఓ అబ్దుల్‌హై ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పరిరక్షిస్తూ విద్యాలక్ష్యాలు చేరుకునేలా సంఘాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సోమశేఖర్, ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, రవీందర్‌రాజు, కిరణ్‌కుమార్, సీఎస్‌ఆర్ మల్లిక్, మోజెస్, సీహెచ్.లింగారావు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ పాలసీపై శిక్షణ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌లోని టీచింగ్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సౌజన్యంతో న్యూఎడ్యుకేషన్ పాలసీపై ఆన్‌లైన్‌లో శిక్షణను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా అధ్యాపకులు మెరుగైన విద్యను బోధించేందుకు 'ఓరియెంటేషన్ అండ్ సెన్సిటైజేషన్' అంశంపై ఎనిమిది రోజుల శిక్షణను అందిస్తున్నట్లు నిట్ డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో టీచింగ్ లెర్నింగ్ సెంటర్ హెడ్ కిషోర్‌కుమార్, ఆన్‌లైన్‌లో వివిధ ప్రాంతాల నుంచి 160 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో కైట్ ఫెస్టివల్

కేయూ క్యాంపస్: జాతీయ యువజన దినోత్సవాన్ని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు లింగ సమానత్వంపై వక్తృత్వ పోటీలు, కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా భద్రునాయక్, అశోక్‌కుమార్, ఆ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, చిల్డ్రన్స్ హోం సూపరింటెండెంట్ కళ్యాణి, మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ కళ్యాణి, ఎస్‌ఎఫ్‌ఎల్ లావణ్య, జిల్లా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పోషణ్ అభియాన్ సిబ్బంది డీడబ్ల్యూఓ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'పల్లె దీపాలు' పుస్తకావిష్కరణ




విద్యారణ్యపురి: ప్రముఖ రచయిత, కవి, గాయకుడు ప్రభుత్వ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాసులు రచించిన 'పల్లె దీపాలు' పాటల పుస్తకాన్ని హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య శుక్రవారం ఆవిష్కరించారు. హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయిలయ్య పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈపుస్తకంపై డాక్టర్ కందూరు సుధాకర్ సమీక్ష చేసి సభికులను ఉత్తేజపర్చారు. ప్రధాన వక్తగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎర్ర విజయ కుమార్, ఆ పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేశ్, కోశాధికారి రవికుమార్, మహేందర్, గౌషియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించాలి



వర్ధన్నపేట: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించాలని వర్ధన్నపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నోడల్ అధికారి, మామునూరు ఏసీపీ సతీశ్‌బాబు అధ్యక్షతన సెక్టార్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తుగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లను గుర్తించి 10 రోజుల్లో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.

మేడారం జాతరకు ఆర్టీసీ సమాయత్తం



వచ్చే నెల 21 నుంచి 24 వరకు జాతర

- మహిళలకు ఉచిత ప్రయాణంతో ఈసారి భక్తులు పెరుగుతారని అంచనా
- 4 వేల నుంచి 6 వేల బస్సులు నడిపేందుకు సన్నాహాలు
- మేడారంలో 47 ఎకరాల్లో బస్టాండ్, ఇతర కౌంటర్ల ఏర్పాటు
- 42 క్యూ రెయిలింగ్‌లు.. చురుగ్గా సాగుతున్న పనులు
- మరో 10 నుంచి 20 ఎకరాల స్థలం అవసరమని ప్రతిపాదన
- తాడ్వాయిలో 10 ఎకరాల్లో పార్కింగ్



క్యూ రెయిలింగ్ పనులు పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు



మేడారంలో ఆర్టీసీకి కేటాయించిన స్థలాన్ని చదును చేస్తున్న దోజర్లు

హన్మకొండ: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆర్టీసీ సమాయత్తమవుతోంది. ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. గత జాతర వైఫల్యాలు సమీక్షించుకుంటూ, ఈసారి పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 21, 22, 23, 24 తేదీల్లో వనదేవతల జాతర జరగనుంది. జాతర భక్తులను చేరవేసేందుకు వారం రోజుల ముందు నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి బస్సులు నడిపేలా కార్యాచరణ సిద్ధం చేశారు. గత జాతరకు ఆర్టీసీ బస్సుల ద్వారా 25 లక్షలకు పైగా భక్తులను చేరవేయగా, ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఈసారి భక్తులు పోటెత్తుతారని ఆర్టీసీ భావిస్తోంది. 4 వేల ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులు ముందుగా అనుకున్నారు. కానీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో 6 వేల ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి మొత్తం 50కి పైగా ప్రత్యేక బస్ పాయింట్ల నుంచి భక్తులను మేడారానికి చేరవేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బస్ పాయింట్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు.

మేడారంలో బస్టాండ్ క్యూ రెయిలింగ్ పనులు

మేడారంలో ఆర్టీసీకి కేటాయించిన స్థలంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జేసీబీలు, డోజర్‌లతో స్థలాన్ని చదును చేస్తున్నారు. దీంతోపాటు క్యూ రెయిలింగ్ పనులు చేస్తున్నారు. మొత్తం 47 ఎకరాల విస్తీర్ణంలో బస్‌ల పార్కింగ్, బస్‌ల మరమ్మతుల షెడ్, కార్మికులు, అధికారులకు వసతి, తాగునీటి సౌకర్యం, క్యాంటిన్, మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు, ప్రయాణికులు బస్సులు తిరిగి వెళ్లే క్రమంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, భక్తులు బస్సులోకి చేరేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులు ఎక్కేందుకు 42 క్యూ రెయిలింగ్‌లు నిర్మిస్తున్నారు. వీటిని మరో 6 పెంచాలని ఆలోచనలో అధికారులున్నారు. భక్తులు ఒక్కసారిగా తిరుగు ప్రయాణానికి వస్తే వెంట వెంటనే బస్సులు సమకూర్చేందుకు తాడ్వాయి వద్ద 10 ఎకరాల్లో పార్కింగ్‌తోపాటు టికెట్ జారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో ప్రత్యేక బస్సులు సంఖ్య 4 వేల నుంచి 6 వేలకు పెంచనుండడంతో మేడారంలో అదనంగా 10 నుంచి 20 ఎకరాల స్థలం అవసరం కానుంది. తమకు కావాల్సిన 20 ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి, జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆర్టీసీ అధికారులు కోరారు.

కార్మికులకు సకల సౌకర్యాలు

బస్సుల సంఖ్య పెంచితే కార్మికులు పెరగనున్నారు. ఈ క్రమంలో గతంలో రెండు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా ఈసారి 4 ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కమాండ్ కంట్రోల్ రూమ్, కార్మికులకు 120 రెస్ట్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క రూంలో 15 మంది సిబ్బంది ఉండేందుకు వీలుగా వీటిని నిర్మిస్తున్నారు. బస్టాండ్‌లో బస్సుల కోసం వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న ప్రయాణికులకు సమాచార నిమిత్తం, బస్సుల వివరాలు తెలిపేందుకు రెండు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి...



మేడారంలో జాతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్టీసీకి కేటాయించిన స్థలాన్ని చదును చేయడంతోపాటు, వసతి, పార్కింగ్, గ్యారేజీ, ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు క్యూ రెయిలింగ్ పనులు నడుస్తున్నాయి. సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులను క్షేమంగా చేరవేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

- జాస్తి శ్రీలత, ఆర్టీసీ ఆర్‌ఎం, వరంగల్

యువతకు స్ఫూర్తి వివేకానంద

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హసన్‌పర్తి: నేటి యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర, వరంగల్ పోలీస్ కమిషనరేట్, కిట్స్ ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవ వేడుకల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి అన్వేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకమంలో కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, భోజరాజు, కళాశాల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీశ్‌చంద్ర, డాక్టర్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ శంకర్, ఎంవీఐ ఫాహిమా సుల్తానా, పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధ్యంకాని హామీలిచ్చిన కాంగ్రెస్

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలిచ్చి ఇప్పుడు దరఖాస్తుల పేరిట కాలయాపన చేస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు మరో 420 హామీలిచ్చిందని వాటన్నింటినీ వంద రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తమపై విమర్శలు మాని పలుకుబడిని ఉపయోగించి అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావాలని సూచించారు. పంటల రుణ మాఫీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని, రైతుబంధు నిధులు వెంటనే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అంతకుముందు రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 27 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ చాడ సరిత, వైస్ ఎంపీపీ సంపత్, సర్పంచ్ మాధవరెడ్డి, రాజిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచులు మాధవరెడ్డి, రవీందర్, రాజిరెడ్డి, ఉప సర్పంచ్ సురేశ్ బీఆర్‌ఎస్ నాయకులు మల్లిఖార్జున్, బిల్లా యాదగిరి, భూపతిరాజు, ఏలూరి వీరయ్య, జోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎస్‌ఎస్‌లో జాతీయ యువజన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చూపిన మార్గాన్ని స్మరించుకున్నారు. అనంతరం వృత్తి నైపుణ్య కేంద్రంలో టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. నైపుణ్య కేంద్రం ఇన్‌చార్జ్ నయీం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, క్రీడా కోచ్‌లు నరేందర్, శ్రీమాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓసిటీలో జాతీయ యువజన దినోత్సవం

కాశిబుగ్గ: వరంగల్ ఓ సిటీ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో.. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్‌ఓ) సత్యవాణి పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

'స్వచ్ఛ'కు ఆమడ దూరం!

- స్వచ్ఛ సర్వేక్షణ్-24లో జీడబ్ల్యూఎంసీకి 101వ ర్యాంకు
- గ్రేటర్‌కు దక్కని మెరుగైన ఫలితం

వరంగల్ అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్-24లో దేశవ్యాప్త నగరాల్లో వరంగల్ 101వ ర్యాంకులో నిలిచింది. పది లక్షల జనాభా ఉన్న నగరాల్లో గ్రేటర్‌కు ఈ ర్యాంకును ప్రకటించారు. గతేడాది 65వ ర్యాంకు సాధించిన గ్రేటర్ వరంగల్ ఈసారి డీలా పడింది. దేశవ్యాప్తంగా 4,354 పట్టణాలు, నగరాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ అమలు తీరుపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల ర్యాంకులను శుక్రవారం విడుదల చేసింది. దేశంలోనే మొదటిసారిగా 2012 అక్టోబర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలుకు గ్రేటర్ శ్రీకారం చుట్టి శానిటేషన్ నిర్వహణలో బెస్ట్ సిటీగా అనేక అవార్డులు రివార్డులు, అందుకుంది. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచింది. కానీ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్త ర్యాంకింగ్‌లో హైదరాబాద్‌కు మొదటి స్థానం దక్కగా.. వరంగల్ నగరం ఐదో స్థానంలో నిలిచింది.

చెత్తపై చిత్తశుద్ధి కరువు

గ్రేటర్ వరంగల్ మహానగర పరిధి 507 చదరపు కిలోమీటర్లు. 66 డివిజన్లు, జనాభా 11 లక్షలు, 2.70 లక్షల కుటుంబాలు. నగరంలో రోజూ 450 టన్నుల చెత్త వెలువడుతోంది. 2,600 మంది పారిశుద్ధ్య కార్మికులు, 400కు పైగా చెత్త వాహనాలున్నాయి. చెత్త నిర్వహణకు ఏటా.. రూ.100 కోట్లకు పైగా.. వ్యయం అవుతోంది. రోజూ ఇంటింటా చెత్త సేకరణ 80 శాతం జరుగుతోంది. మిగిలిన 20 శాతం ఇళ్లల్లోని చెత్త రహదారుల్లో, కుండీల్లో, ఖాళీ స్థలాల్లో, డ్రైయినేజీల్లో పేరుకుపోతోంది. తడి, పొడి చెత్తను 40 శాతం ఇళ్ల నుంచి వేరు చేసి సేకరిస్తున్నారు. అందులో ప్లాస్టిక్ కాగితాలు, సీసాలు, ఇతర వస్తువులు 10 టన్నుల మేర డ్రై వేస్ట్ రిసోర్స్ కలెక్షన్ సెంటర్లు(డీఆర్‌సీసీ)లకు చేరుతోంది. మిగిలిన 440 టన్నుల చెత్త మడికొండ డంపింగ్ యార్డుకు చేరుతోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల, అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కొరవడింది. ఓడీఎఫ్ డబుల్ ప్లస్ స్థానాన్ని మూడోసారి దక్కించుకున్న గ్రేటర్ వరంగల్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మాత్రం వెనుకబడుతోంది.

దెబ్బపడింది అక్కడే..

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో వెనుకబడడానికి ప్రధాన కారణం శాస్త్రీయ పద్ధతిలో చెత్తను ఖననం చేసేందుకు ఎలాంటి చర్యలు లేవు. అందుకోసమే మార్కులు తగ్గాయి. రోజువారీగా వెలువడుతున్న చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ఖననం(డిస్పోజ్) చేయడం, పునర్వినియోగం(రీ సైక్లింగ్) స్థానికంగా లేదు. ఆదిశగా ప్రాథమిక అడుగులు వేసినా.. మళ్లీ మొదటికి వచ్చింది. బహిరంగ మల, మూత్ర విసర్జనలో పాయింట్లు తగ్గాయి. పెద్ద ఎత్తున పబ్లిక్ టాయిలెట్లు నిర్మించినా.. బహిరంగ మల, మూత్ర విసర్జన జరుగుతోంది.

భక్తులకు వసతులు కల్పించండి

- అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా



జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి: మకర సంక్రాంతి సందర్భంగా కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అధికారులకు సూచించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎప్పటికప్పుడు శానిటేషన్, పారిశుద్ధ్యం నిర్వహించాలని, భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీధి దీపాలు నిరంతరాయంగా వెలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెవెంట ఆర్డీఓ రమేశ్, ఎంపీడీఓ భాస్కర్, ఆలయ ఈఓ కిషన్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీఓ నాగరాజు, అర్చకులు రాజయ్య, రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

చలో ఐలోని జాతర

నేటి నుంచి ఉత్సవాలు షురూ

- భక్తులకు అన్ని ఏర్పాట్లు
- పోలీసుల భారీ బందోబస్తు



ఐనవోలు ఆలయం వ్యూ



మల్లికార్జునస్వామి

ఐనవోలు: వందల ఏళ్ల చరిత్ర కలిగిన ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో ఐనవోలు మల్లిఖార్జున స్వామి ఆలయం ఒకటి. ఇక్కడ ఏటా నిర్వహించే జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈఏడాది జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. జానపదుల జాతరగా కీర్తినొందుతున్న ఐనవోలు జాతర ఉత్సవాలు శనివారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి.

జాతర షెడ్యూల్..

- జనవరి 13న శనివారం ఉత్సవాలు ప్రారంభం. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ
- 14న భోగి పండుగ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- 15న మకర సంక్రాంతి పండుగ, ప్రత్యేక పూజలు, 'రాత్రి ప్రభల' బండ్ల తిరుగుట
- 17న మహా సంప్రోక్షణ సమారాధన
- ఫిబ్రవరి 14న వసంత పంచమి, భ్రమరాంబిక అమ్మవారి దశమ వార్షికోత్సవం
- ఫిబ్రవరి 24న ఎల్లమ్మ దేవత పండుగ
- మార్చి 6 నుంచి 10 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తంగా నిర్వహణ
- మార్చి 6న శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం. ఉదయం సూర్యప్రభ వాహన సేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ
- 7న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి శేష వాహనసేవ, బలిహరణ
- 8న మహా శివరాత్రి 'శివ కల్యాణం' పెద్దపట్నం, ఉదయం సింహ వాహనసేవ, రాత్రి నంది వాహనసేవ
- 9న వాహన సేవ, రాత్రి రథోత్సవం
- 10న పర్వత వాహనసేవ, రుద్రహోమం, చండీ హోమం, బ్రహ్మోత్సవాల ముగింపు, రాత్రి పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ
- ఏప్రిల్ 7న గొల్లకేతమ్మ బలిజమేడలమ్మలతో మల్లికార్జునస్వామి కల్యాణం, పెద్దపట్నం, ఊరేగింపు
- ఏప్రిల్ 9న 'ఉగాది' బిల్వార్చన, సాయంత్రం పంచాంగ శ్రవణం

ప్రతి బుధ, ఆది వారాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు. వివిధ కార్యక్రమాలతో మూడు నెలలపాటు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి.


ముమ్మరంగా సాగుతున్న జాతర పనులు

జాతర పనుల్లో బాగంగా క్యూలైన్లు, చలువ పందిళ్లు, నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, జల్లు స్నానాలు, స్త్రీలు బట్టలు మార్చుకునే గదుల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, ఆలయం చుట్టూ లైటింగ్, సిరీస్ బల్బుల ఏర్పాటు తదితర పనులన్నీ తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. జాతర సమయంలో రెప్పపాటు కూడా కరెంటు పోకుండా విద్యుత్ శాఖ తగు ఏర్పాట్లు చేసింది. 'కుడా' నిధులతో సులభ్ కాంప్లెక్స్ నిర్మించగా.. జాతర ఉత్సవాల్లో ప్రారంభించనున్నారు. దాతల సహకారంతో 40/100 పొడుగు వెడల్పులతో డార్మెటరీ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయి. దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రంలో అన్నదానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ తాగునీరు, నీటి సరఫరాపై దృష్టి పెట్టింది. భక్తులకు ఉపయుక్తంగా దుకాణ సముదాయాలు ఏర్పాటవుతున్నాయి.

ప్రత్యేక బస్సులు, పోలీసుల బందోబస్తు

ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది 24 గంటల వైద్య సేవలు మూడు షిఫ్టులుగా అందించడానికి సిద్ధంగా ఉన్నారు. రోడ్డు రవాణా సంస్థ ఐనవోలు నుంచి హైదరాబాద్, వరంగల్, కాజీపేట, కొమురవెల్లి, వేములవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే భక్తులకు బస్సుల సౌకర్యం కల్పించనున్నారు. వరంగల్ నుంచి జాతర నాలుగు రోజులు ప్రతీ పది నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారుల పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడనున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా.. 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ తెలిపారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సుమారు 100 సీసీ కెమెరాల నిఘాలో నిరంతరం పర్యక్షిస్తున్నారు. అదేవిధంగా జాతర సమయంలో ఏర్పాటు చేసే రంగుల రాట్నం, జాయింట్ వీల్‌తో పాటు పలు వినోద కార్యక్రమాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

సామాన్యులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు



ఎండోమెంట్ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. భక్తులకు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి సమాచారం, ఆలయంలో సంవత్సరం పాటు జరిగే పూజా కార్యక్రమాల వివరాలు అందుబాటులో ఉంచుతున్నాం. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వీవీఐపీల తాకిడిని నియంత్రించేందుకు ఎలాంటి రికమండేషన్‌కు తావు లేకుండా రూ.500 ప్రత్యేక టికెట్‌తో పాటు క్యూలైన్ ఏర్పాటు చేశాం. భక్తులు, అధికారులు, వలంటీర్లు కీలకమైన నాలుగు రోజులు సహకరించాలన్నారు. మేడారం జాతర దృష్ట్యా భక్తుల తాకిడి మేరకు సరిపడా లడ్డూ, పులిహోర ప్రసాదాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నాం.

- అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఈఓ, ఐనవోలు

భక్తుల బాధలకు చెల్లు

'మల్లన్న' క్షేత్రంలో తొలి ఫెస్టివల్ కమిటీ | పదేళ్ల తర్వాత జాతర సమయంలో ఏర్పాటుకు ఆమోదం

- ఇక నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో కమిటీలు
- జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కృషితో అడుగులు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ



సాక్షి, వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామివారి ఆలయానికి సంబంధించి పదేళ్ల తరువాత తొలి ఫెస్టివల్ కమిటీ ఏర్పడింది. ప్రజాప్రాతినిధ్యం లేకుండా ఈవోల సమక్షంలో ఐనవోలు మల్లన్న జాతర జరగడం సరికాదనే ఉద్దేశంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ప్రముఖ న్యాయవాది నామాని శేఖర్ రావు.. ఆలయంలో ఫెస్టివల్ కమిటీల ఏర్పాటు అంశం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, ధర్మకర్తల నియామక (1987) చట్టం అనుసరించి ఆలయాల్లో రెగ్యులర్ కమిటీ లేని సమయంలో పండుగ, జాతర, ఇలా ప్రత్యేక సందర్భాల్లో ఫెస్టివల్ కమిటీని నియమించొచ్చనే అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి కొండా సురేఖ వెంటనే ఈ ఫెస్టివల్ కమిటీ అంశాలను వివరిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీంతో 2014లో ఫెస్టివల్ కమిటీలపై హైకోర్టు విధించిన స్టేను ఆధారంగా చేసుకుని ఇంతకాలం అధికారులు ప్రజాప్రాతినిధ్యం లేకుండా చేయడంతో ఆడిందే ఆట...పాడిందే పాటగా మారింది. అయితే 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఫెస్టివల్ కమిటీలు ఏర్పాటు చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకుని ప్రస్తుతం తెలంగాణలోనూ ఫెస్టివల్ కమిటీల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దేవాదాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ పేరుతో జీవో 4 ద్వారా శుక్రవారం ఆదేశాలిచ్చారు. దీని వల్ల ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో కూడా ఫెస్టివల్ కమిటీలు ఏర్పాటుకు అడుగులు పడ్డాయి.

ఇక అన్నీ ఆలయాలకు వర్తింపు ...

రాష్ట్రంలోని దాదాపు 90 శాతం ఆలయాల్లో రెగ్యులర్ కమిటీలు లేవు. అదే సందర్భంలో జాతర సమయంలో ఫెస్టివల్ కమిటీలు కూడా ఏర్పాటుచేయడం లేదు. దీంతో జాతరలో భక్తులకు సరైన సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. చాలా మంది ఈవోలు తమ అధికారం కొనసాగాలనే ఉద్దేశంతో ఈ ఫెస్టివల్ కమిటీల నియమాక జోలికి వెళ్లకుండా అంతా తమ కనుసన్నల్లోనే జరిగేలా వ్యవహరిస్తున్నారు. ఈ విధంగానే ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానానికి కూడా రెండేళ్లుగా రెగ్యులర్ కమిటీ లేకపోవడంతో జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈవో అంతా తానై వ్యవహరిస్తుండడంతో ప్రజాప్రతినిధ్యం ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నాగరాజు, ఆయన లీగల్ అడ్వయిజర్ నామాని శేఖర్ రావు.. ఫెస్టివల్ కమిటీల వల్ల భక్తులకు ఏర్పడే సౌకర్యాలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే కమిటీల ఏర్పాటు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఐనవోలు ఆలయ ఉత్సవ కమిటీ..

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి 7 రోజుల కాలవ్యవధికి సంబంధించి 15 మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ ఎండోమెంట్ కమిషనర్ వి అనిల్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో రెన్నోవేషన్, పర్మినెంట్ కమిటీకి మాత్రమే అవకాశం ఉండగా ప్రభుత్వం జీఓ 4 ద్వారా తెలంగాణ ఎండోమెంట్ యాక్ట్‌కు సవరణ తీసుకువచ్చి ఉత్సవ కమిటీని వేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు జీవో 4ను అనుసరించి 15 మంది సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ఐనవోలు ఫెస్టివల్ కమిటీ సభ్యులు వీరే...

ఎద్దు సత్యనారాయణ, పాల్లెపల్లి బుచ్చిరెడ్డి, మార్నేని వెంకటేశ్వరరావు, నునావత్ కీమా నాయక్, మజ్జిగ రాములు, గడ్డం శ్రీనివాస్, జెట్టబోయిన శ్రీనివాస్, ఒగ్గుల మాధవి, తాటికొండ కృష్ణమూర్తి, చెరుకొండ వెంకటేశ్వర్లు, కొండేటి మమత, కుసా చిరంజీవి, నాగబెల్లి మహేందర్, గురుమంచి వేణు గోపాలచారి, పాతరిపాటి రవీందర్.

ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఐనవోలు జాతరకు 15 మందితో కూడిన ఫెస్టివల్ కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదముద్ర వేశారు. దీంతో దాదాపు పదేళ్ల తర్వాత ఫెస్టివల్ కమిటీ ఏర్పాటైన తొలి దేవాలయంగా ఐనవోలు మల్లన్న క్షేత్రానికి పేరొచ్చింది. ఇప్పుడూ ఈ విధంగానే ఉమ్మడి వరంగల్ లోని మెట్టుగుట్ట, ఎర్రగట్టుగుట్ట జాతరతో పాటు వివిధ ఆలయాలకు జాతర, పండుగ సమయాల్లో తాత్కాలిక కమిటీల ఏర్పాటుకు అవకాశం ఏర్పడింది.

ఈ చట్టం ఏం చెబుతుందంటే...

తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థలు, ధర్మకర్తల నియామకాల చట్టం (1987) ప్రకారం సాధారణ ధర్మకర్తల మండలి లేకున్నా.. కమిషనర్ నిర్దిష్ట సందర్భాలలో దేవాలయాలకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయొచ్చు. దాని సభ్యుల సంఖ్య ధర్మకర్తల మండలితో సమానంగా ఉంటుంది. చట్టంలోని సెక్షన్లు 18,19లో నిర్దేశించబడిన అర్హతలు, అనర్హతలు ఈ సభ్యులకు వర్తిస్తాయి.

ఎస్సీ వర్గీకరణ హామీ నెరవేర్చాలి

- మాట తప్పితే బీజేపీకి గుణపాఠం చెబుతాం
- ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

హన్మకొండ : ఎస్సీ వర్గీకరణ చేపడుతామనే బీజేపీ హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్–టీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వంగపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మాదిగలు గుణపాఠం చెబుతారన్నారు. మాదిగలను మోసం చేస్తే ఫలితం అనుభవిస్తారన్నారు. ప్రభుత్వం వృత్తి పనులు చేసుకునే వారికి పెన్షన్ ఇస్తుందన్నారు. అయితే డప్పులు కొట్టే వారికి, చెప్పులు కుట్టే వారికి మాత్రం పెన్షన్ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డప్పు కొట్టే వారికి, చెప్పులు కుట్టే వారికి నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, దళితబంధు పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, గతంలో ఎంపిక చేసిన వారికి వెంటనే సహాయం అందించాలన్నారు. అలాగే, మంత్రి వర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్–టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఇద్దునూరి యాకయ్య, రామంచ సారన్న, చిన్న స్వామి, ఆరేపల్లి బాబన్న, దేవరకొండ సదానందం, ఎలుకటి రాజయ్య, గడ్డం భద్రయ్య, రాకేష్, సుధన్, అనిల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్ వైఖరిపై యూజీసీకి ఫిర్యాదు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో రెండున్నరేళ్లలో వీసీ, రిజిస్ట్రార్ అనుసరిస్తున్న వైఖరి, అలాగే, యూనివర్సిటీలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఈనెల 5న యూజీసీకి ఫిర్యాదు చేసినట్లు కాకతీయ యూ నివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్) జనరల్‌సెక్రటరీ మామిడాల ఇస్తారి శుక్రవారం తెలిపారు. యూజీసీ వెంటనే స్పందించి యూనివర్సిటీలో జరుగుతున్న అవతకలపై వెంటనే రిపోర్ట్ పంపాలని కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ను కోరినట్లు తనకు ఈనెల 11న యూజీసీ డిప్యూటీసెక్రటరీనుంచి ఈమెయిల్ ద్వారా సమాచారం అందిందని ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రొఫెసర్‌గా పది సంవత్సరాల అనుభవం లేకున్నా కేయూ వీసీగా రమేష్‌ను నియమించడంతో యూనివర్సిటీలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. యూనివర్సిటీ చట్టానికి విరుద్ధంగా రిటైర్డ్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్అండ్‌సైన్స్ కాలేజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను క్యాంపస్‌కు బదిలీ చేయించుకుని, కీలక విభాగాల్లో ఒక్కడినే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించి అక్రమాలకు తెరలేపారన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి కూడా పట్టుబడ్డారని పేర్కొన్నారు. పలువురి అధ్యాపకులపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ రొటీన్‌గా వచ్చే విభాగాధిపతి, బీఓఎస్, తదితర పదవుల్లో తమకు ఇష్టం ఉన్న వారినే నియమిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనలపై యూజీసీ స్పందించి వెంటనే బాధ్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వరంగల్ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

వరంగల్ : ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు వరుస సెలవు ఉన్నట్లు మార్కెట్ కార్యదర్శి సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ శనివారం వారంతపు యార్డు బంద్, 14వ తేదీ ఆదివారం వారాంతపు సెలవు–భోగి పండుగ, 15వ తేదీ (సోమవారం) సంక్రాంతి పండుగ, 16వ తేదీ (మంగళవారం) కనుమ పండుగ సందర్భంగా నాలుగు రోజులు మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలను జరగవని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, అడ్తిదారులు, వ్యాపారులు, గుమస్తాలు, దడవాయిలతో పాటు కార్మికులు గమనించాలని కోరారు. తిరిగి 17వ తేదీన పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

20న జాకారంలో మెగాజాబ్ మేళా

- ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ములుగు మండలం జాకారం వైటీసీలో ఈనెల 20వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో 20 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని, రూ.15 వేలు నుంచి రూ. 30వేల వరకు వేతనం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ చదివి ఉండాలన్నారు. 18 నుంచి 35 వయసు గల వారు అర్హులన్నారు. తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్ పత్రాలను వెంట తీసుకుని 20వ తేదీ ఉదయం 10 గంటలకు జాకారం వైటీసీకి హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 8008932159, 79816 33716 సంప్రదించాలన్నారు.

మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తి

- నేడు తనిఖీ చేయనున్న కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ఉప్పల్–హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య పూర్తయిన మూడో రైల్వే లైన్ నిర్మాణాన్ని శనివారం దక్షిణ మధ్య రైల్వే కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ తనిఖీ చేయనున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం రాత్రి తెలిపారు. 2010–11 రైల్వే బడ్జెట్‌లో మంజూరైన బల్లార్షా–విజయవాడ మధ్య గల మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా 2016లో సుమారు 100 కిలోమీటర్ల వరకు మందమర్రి–హసన్‌పర్తి వరకు దశల వారీగా మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టారు. ఇటీవల ఉప్పల్–హసన్‌పర్తి మధ్య 10 కిలోమీటర్ల వరకు నిర్మించిన థర్డ్‌లైన్‌ను రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీ చేస్తారని అధికారులు పేర్కొన్నారు. ట్రాక్ అన్ని విధాలా సరిగా ఉంటేనే ఫిట్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. ట్రాక్ ఫిట్ సర్టిఫికెట్ ఇస్తే మందమర్రి–హసన్‌పర్తి వరకు థర్డ్‌లైన్ అందుబాటులోకి వస్తుంది. దీంతో కొత్తఢిల్లీ–విజయవాడ, హైదరాబాద్ మార్గంలో రైల్వే ట్రాఫిక్ సమస్య తగ్గనుందని రైల్వే అధికారులు తెలిపారు.

రైళ్లు.. రద్దీ



విజయవాడ వైపునకు వెళ్తున్న శాతవాహన రైలులో ప్రయాణికుల రద్దీ

డోర్నకల్: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రైళ్లన్నీ రద్దీగా నడుస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ వైపునకు వెళ్లే రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ శుక్రవారం సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా శ్రీకాకుళం వరకు, శనివారం శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్ వరకు ప్రత్యేక రైలు నడుపుతోంది.

కేయూ అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కంపెనీ ప్రతినిధులు

కేయూ క్యాంపస్ : న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగిన కాకతీయ యూనివర్సిటీ.. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా'తో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన పత్రాలను కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు , 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా' ప్రతినిధి, ఆ సంస్థ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఎస్ రాజవోలు వెంకటరమణ కేయూ క్యాంపస్‌లో మార్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం వల్ల రెండు సంస్థలు అకడమిక్ పరంగా సహకరించుకుంటాయి. తద్వారా విద్యార్థులకు ఆ కంపెనీ సెక్రటరీ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగపడుతుంది. ప్లేస్‌మెంట్స్ పొందేందుకు కూడా అవకాశం ఉంటుంది. ప్రస్తుత జాబ్ మార్కెట్ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉద్యోగావకాశాలుంటాయి. కార్యక్రమంలో కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల ప్రిన్సి పాల్ నర్సింహాచారి, డీన్ పి అమరవేణి, బీఓఎస్ చైర్మన్ కట్ల రాజేందర్, అధ్యాపకుడు ఫణీంద్ర, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్, 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' నుంచి హైదరాబాద్ చాప్టర్ చైర్ పర్సన్ సీఎస్ తంగిరాల లలితాదేవి, కోశాధికారి సీఎస్ మహాదేవ తిరునగరి, ఐసీఎస్ఐ, ఎస్ఐఆర్సీ సీఎస్ జీఎస్ఎల్‌గుప్తా , హైదరాబాద్ చాప్టర్ ఆఫీసర్ వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవదానం.. పలువురికి ప్రాణదానం



శ్రీకాంతాచారి(ఫైల్)

గీసుకొండ: గీసుకొండ మండల కేంద్రానికి చెందిన కర్ణకంటి శ్రీకాంతాచారి (28) కొంతకాలంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండగా మూడు రోజుల క్రితం అదే ఆస్పత్రిలో చేరగా బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారని బంధువులు శుక్రవారం తెలిపారు. ఆ యువకుడి తల్లిదండ్రులు బ్రహ్మచారి, సరస్వతి మానవతా దృక్పథంతో తమ కుమారుడి కంటి కార్నియా, గుండె, కిడ్నీలు, లివర్ తదితర అవయవాలను దానం చేయడానికి ముందుకు రాగా.. ఆస్పత్రి యాజమాన్యం వాటిని సేకరించి పలువురికి ప్రాణదానం చేశారు. స్వగ్రామం గీసుకొండలో సాయంత్రం శ్రీకాంతాచారి అంత్యక్రియలు జరిగాయి. రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మినారాయణ మృతుడి కుటుంబానికి రూ. 5 వేల సాయం అందించారు.

బోధనేతర విధుల నుంచి మినహాయించాలి

- పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి

విద్యారణ్యపురి: గురుకుల ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి మినహాయించాలని పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని న్యూసైన్స్ పీజీ కళాశాలలో పీఆర్‌జీటీఏ ఉమ్మడి వరంగల్ జిల్లా గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకుల సంయుక్త సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా బీసీ వెల్ఫేర్, జనరల్ సొసైటీల పాఠశాలల వేళలు మార్చాలన్నారు. డిప్యూటీ వార్డెన్ విధుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. కేర్‌టేకర్లను కౌన్సిలర్లుగా నియమించాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయ, అధ్యాపకులకు తదుపరి కేడర్‌లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ పీఆర్‌జీటీఏ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏజెండాగా రాష్ట్రంలో బలమైన ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూటీఎస్ మద్దతుతో ఏర్పడిందన్నారు. సమావేశంలో పీఆర్‌జీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం వేణుప్రసాద్, సెక్రటరీ స్వప్న, జాయింట్ సెక్రటరీలు ఉప్పు అశోక్, డాక్టర్ ఇ శ్రీనివాసచారి, డాక్టర్ ఐ నిర్మలానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కె రామకృష్ణారెడ్డి, పి విద్యాసాగర్, పానుగంట విజయ్‌కుమార్, చీదేటి లక్ష్మారెడ్డి, చెలకాని సంజీవ రెడ్డి, ఎంజేపీటీబీసీడబ్లూ ఆర్ఈఐఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌డబ్లూ ఆర్ఈఐఎస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి బి రాజు, ఉపాధ్యక్షుడు బి వనితారెడ్డి, వివిధ సొసైటీల విభాగాల రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ఉమ్మడివరంగల్ జిల్లా పీఆర్‌జీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉమ్మడి వరంగల్ జిల్లా పీఆర్‌జీటీఏ నూతన కార్యవర్గాన్ని ఈసమావేశంలో ఎన్నుకున్నారు. టీఎస్‌డబ్లూఆర్ఈఐఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఆర్ శోభ, జనరల్‌సెక్రటరీగా జి సుధాకర్, అసోసియేట్ ప్రసిడెంట్‌గా వై రజిని, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ శోభన్, సెక్రటరీగా ఆర్ స్వప్న ఎన్నికయ్యారు. ఎంజేబీసీడబ్లూ ఆర్ఈఐఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలుగా ఎ స్వేత, జనరల్ సెక్రటరీగా కె శ్రీనివాస్,అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్ రజిత, ఉపాధ్యక్షురాలిగా బి నివేదిత, సెక్రటరీగా రమణారెడ్డి ఎన్నికయ్యారు. టీఎంఆర్ఈఐఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలుగా ఎన్ సౌజన్య, జనరల్‌సెక్రటరీగా జావీద్‌పాషా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పిశిరీష, ఉపాధ్యక్షులుగా బి రాజశేఖర్, సెక్రటరీగా నజియా తహసీన్ ఎన్నికయ్యారు. టీఆర్ఈఐఎస్‌వరంగల్‌జిల్లా అధ్యక్షురాలుగా జి ప్రియదర్శిని, జనరల్‌సెక్రటరీగా డి ఉమను ఎన్నుకున్నారు. అనంతరం పీఆర్‌జీటీఏ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో దివ్యాంగులకు ప్రత్యేక ఓపీని ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. నిత్యం వేలాది మంది రోగులు ఎంజీఎంకు వస్తారన్నారు. ఈ క్రమంలో దివ్యాంగులు వైద్యచికిత్సలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఓపీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎంజీఎం ఆర్ఎంఓలు మురళీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హరిచందనకు 'వీర్‌గాథ్' అవార్డు



హరిచందనను అభినందిస్తున్న డీఈఓ అబ్దుల్ హై

హసన్‌పర్తి: జాతీయ స్థాయి వీర్‌గాథ్ 3.0 అవార్డుకు హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పదో తరగతి విద్యార్థి ఆకుతోట హరిచందన ఎంపికైంది. ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, ధర్మేంద్రప్రదాన్ చేతుల మీదుగా రూ.10వేలు నగదుతో పాటు ప్రశంస పత్రం అందుకుంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతరామ్ కర్ణ తెలిపారు.అలాగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో హరి చందన పాల్గొంటున్నట్లు చెప్పారు. 'ఝాన్సీ లక్ష్మీ బాయ్ కలలోకి వచ్చి నీవు దేశానికి సేవలు ఎలా చేస్తావు' అనే అంశంపై ఇటీవల నిర్వహించిన పెయింటింగ్‌లో హరి చందన పాల్గొంది. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 37 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు శాంతరామ్ కర్ణ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి హరిచందనకు అవార్డు దక్కినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ అబ్దుల్ హై, జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసస్వామి.. హరిచందనను అభినందించారు. హరిచందన వీర్‌గాథ్ 3.0 జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు.

భూవివాదంలో తగ్గేదేలే!

- వర్ధన్నపేట డివిజన్‌లోని ఓ ఇన్‌స్పెక్టర్ అత్యుత్సాహం
- సివిల్ వివాదమని తిరస్కరించిన భూమిపైకి వచ్చి విచారణ
- హైకోర్టులో కేసు ఉన్న స్థలంలోకి వెళ్లి నానా హంగామా
- సీపీ అంబర్ కిశోర్ ఝా, హెచ్ఆర్సీకి బాధితుడి ఫిర్యాదు



ఇటీవల భూమి వద్ద విచారిస్తున్న ఇన్‌స్పెక్టర్

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొంతమంది ఇన్‌స్పెక్టర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూవివాదంలో తలదూర్చడంలో తగ్గేదేలే అంటున్నారు. ఇప్పటికే ఓ ఎన్‌డీపీఎస్ కేసు నమోదు విషయంలో అలసత్వం వహించినందుకు ఇటీవల ఐనవోలు ఎస్‌హెచ్‌ఓను సస్పెండ్ చేసిన విషయం మరువకముందే.. వర్ధన్నపేట డివిజన్‌లోని ఓ ఇన్‌స్పెక్టర్ అనవసర భూవివాదంలోకి వెళ్లారు. రాయపర్తి మండలం కుంట దేవేందర్‌కు చెందిన భూవివాదం హైకోర్టులో ఉందన్న విషయం తెలిసి మరీ.. ఆ భూమి వద్దకు వెళ్లి హంగామా చేయడం ఇప్పుడు పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇంతకు అసలు విషయమేంటంటే.. ఈ భూవివాదంపై ఫిర్యాదు పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఇది సివిల్ నేచర్ అంటూ.. రిజెక్ట్ చేసిన రెండోరోజు సదరు ఇన్‌స్పెక్టర్ అక్కడికెళ్లడంతో భూవివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయ్యింది. దీనిపై బాధితుడు దేవేందర్ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు.

రెండుసార్లు రిజెక్ట్ చేసినప్పటికీ..

వర్ధన్నపేట డివిజన్‌లోని ఓ మండలంలో సర్వే నంబర్ 1,503లో దేవేందర్‌కు ఎకరం భూమి ఉంది. తనకు తెలియకుండానే ఆ భూమి ధరణి పోర్టల్‌లో సమీప బంధువుల పేర్ల మీదకు వెళ్లిందని, కొన్నేళ్లుగా తామే వ్యవసాయం చేసుకుంటున్నామంటూ.. 2023 జూన్ 5న ఆయన హైకోర్టుకు వెళ్లాడు. దేవేందర్ ఇచ్చిన భూపత్రాలు, రికార్డులను పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం.. రెస్పాండెంట్‌లకు నోటీసులిచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. రెవెన్యూ అధికారులు విచారణ చేసి పంపిన నివేదిక కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఈసమయంలోనే దేవేందర్ సాగు చేస్తున్న ఈభూమి వద్దకు కొందరు వచ్చారు. ఆ భూమిని ఇతరులకు అమ్మామని హద్దులు పాతుతుంటే ఆయన తల్లిదండ్రులు అడ్డుకున్నారు. దీనిపై డిసెంబర్ 31న సదరు మండల పోలీస్‌స్టేషన్‌లో దేవేందర్ ఫిర్యాదు చేశాడు. సివిల్ వివాదమని జనవరి నాలుగున ఈ పిటిషన్ తిరస్కరించారు. 2023 జూలై 24న ఇదేవిధంగా వచ్చిన పిటిషన్‌ను తిరస్కరించారు. జనవరి 6న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఎస్సై నుంచి దేవేందర్‌కు ఫోన్ వచ్చింది. సీఐ మీ భూమి వద్దకు విచారణకు వస్తున్నారని, వెంటనే అక్కడికి రావాలంటూ సమాచారమిచ్చారు. అరగంట వ్యవధిలోనే సీఐ అక్కడకు చేరుకుని అప్పటికే ఫిర్యాదు ఇచ్చినట్లు చెబుతున్న కుంట సునీత, ఇతర వ్యక్తులతో కలిసి దేవేందర్‌తో మాట్లాడారు. ఈక్రమంలోనే కోర్టులో ఉన్న భూవిషయంలో మీరెందుకు కలుగజేసుకుంటారంటూ.. అనడంతో సదరు సీఐ పరుషపదజాలంతో మాట్లాడారని దేవేందర్.. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జాన్సన్

- టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్

హన్మకొండ : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జాన్సన్ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో టీఆర్‌వీకేఎస్ ట్రాన్స్‌కో వరంగల్ జోనల్ స్థాయి సమావేశం జరిగింది. ట్రాన్స్‌కో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాడ దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం అభివృద్ధి, ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో కె.వి. జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యుత్‌కార్మికుల సమస్యల పరిష్కారానికి నాయకత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం లభించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో విభాగం టీఆర్‌వీకేఎస్ కంపెనీ కార్యదర్శి పులుసు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్బరుద్దీన్, ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి బండారి ప్రభాకర్, సంఘం నాయకులు రాజేందర్, రబ్బానీ, రాజనరేందర్, రామకృష్ణ, రాజు, కందికొండ వెంకటేష్, హరిప్రసాద్, జయచందర్, మౌలానా నాయక్, నాగరాజు, వెంకన్న, రెడ్యా, కరుణాకర్, వెంకట్, హరిప్రసాద్, రాజేష్, రమేష్, రాజేందర్, బాలాజీ, రజినీకాంత్, సంజీవ, రఘుపతి, చంద్రుడు, భాస్కర్, రాజేందర్, రఘు, రాధాకృష్ణ పాల్గొన్నారు.